

రాష్ట్ర స్థాయి అండర్ -14 క్రికెట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని గండి రామన్న సాయిబాబా ఆలయ సమీపంలో శుక్రవారం తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ -14 క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు పాల్గొనగా వారిలో నుంచి ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు జిల్లా కోచ్ రామరాజ్ తెలిపారు. ఎంపిక చేసిన క్రీడాకారులు వచ్చే నెలలో అదిలాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని పేర్కొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

ఆదిలాబాద్

శనివారం | జనవరి 18, 2025 | www.navatelangana.com

20న చలో ఉట్నూర్‌ను విజయవంతం చేయండి

బెజ్జూర్ : ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న చేపట్టే చలో ఉట్నూర్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల మండల సార్‌మేడి కొడప శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జీవో నెం.3, 1/70తో పాటు ఏజెన్సీ ప్రాంత చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చలో ఉట్నూర్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పోడు భూములకు పట్టాలిచ్చి ఆదివాసులకు శాశ్వత హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. 50 శాతం ఆదివాసులు ఉన్న గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించాలన్నారు. దీనికి మండలంలోని ఆదివాసీ గిరిజనులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు సకారాం, తిరుపతి, బానయ్య, ధర్మయ్య, తులసీరాం, మాజీ సర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.



సబ్సిడీ రాక..అవస్థలు తీరక..!

- పరిశ్రమలశాఖ ద్వారా రుణాలు పొందిన వారి దైన్యం
- ఏండ్లుగా ప్రభుత్వ రాయితీ కోసం ఎదురుచూపులు
- ఎస్సీ,ఎస్టీ, వికలాంగ లబ్దిదారుల ఇబ్బందులు
- ఎప్పుడొస్తుందోనని కార్యాలయం వెంట ప్రదక్షిణలు

పేదలకు వరంలా మారాల్సిన సబ్సిడీ రుణాలు కష్టాల పాలు చేస్తున్నాయి. అసలే ఎలాంటి షూరిటీ లేకుండా బ్యాంకులు రుణాలు ఇవ్వక ఇబ్బందులు పడుతుంటే.. రుణం వచ్చిన వారికి సబ్సిడీ రాకపోవడం మరింత అవస్థలకు గురిచేస్తోంది. జీవనోపాధి కోసం తీసుకున్న రుణాలకు రాయితీ అందిస్తామని చెబుతున్న సర్కారు సకాలంలో అందించడంలో విఫలమవుతున్నాయి. రాయితీల పట్ల తీవ్ర అలక్ష్యం చేయడం మూలంగా లబ్దిదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్సీ,ఎస్టీలతో పాటు వికలాంగులకు బ్యాంకుల ద్వారా అందించిన రుణాలకు గత నాలుగేండ్ల నుంచి సబ్సిడీలు రాకపోవడంతో పరిశ్రమల శాఖ కార్యాలయం వెంట ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి ఏర్పడిన ఈ సమస్యను కనీసం కొత్త ప్రభుత్వమైనా పరిష్కరిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు జీవనోపాధి కల్పించేందుకు వివిధ రకాల రుణాలు అందిస్తోంది. బ్యాంకుల ద్వారా అందించే ఈ ఆర్థిక సాయానికి పరిశ్రమలశాఖ ద్వారా సబ్సిడీని అందజేస్తోంది. మహిళల పేరిట రుణం పొందితే 45శాతం సబ్సిడీ, పురుషుల పేరు మీద తీసుకుంటే 35శాతం అందజేస్తోంది. దీంతో చాలా మంది ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు బతుకుదెరువు కోసం వాహనాలను రుణాలుగా తీసుకున్నారు. వస్తు రవాణాతో పాటు యంత్రాలు, ప్రయాణికులను చేర వేసే కార్లు, ట్రాక్టర్లు, జేసీబీలు, టిప్పర్లు తదితర వాటిని రుణాల కింద తీసుకున్నారు. ఇందుకు బ్యాంకులో రుణం తీసుకొని పరిశ్రమల శాఖలో సబ్సిడీ కోసం దరఖాస్తులు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఈ వాహనాల కోసం రాయితీ అందించాల్సిన ప్రభుత్వం తీవ్ర తాత్సారం చేస్తోంది. తొలుత వాహనాలు తీసుకొని ఉపాధి తరుణంలోనే ప్రతి నెలా బ్యాంకులకు కిస్తీలు చెల్లించాల్సి ఉంటుంది. సబ్సిడీ డబ్బులు లబ్దిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంది. కానీ ఈ సబ్సిడీ డబ్బులు సకాలంలో రాకపోవడంతో లబ్దిదారులు బ్యాంకు కిస్తీలు పూర్తిగా చెల్లించాల్సి వస్తోంది. పూర్తిగా చెల్లించిన తర్వాత ప్రభుత్వం నుంచి సబ్సిడీ ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి ఉంది.

ఆర్థిక ఇబ్బందులతో సతమతం..!

ఆదిలాబాద్ జిల్లాలో 2020 నుంచి రాయితీ నిధులు రావడం లేదని అధికారులు చెబుతున్నా..అంతకుముందు నుంచే ఈ సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 2021 నుంచి 2024 ఏడాది వరకు 17మంది ఎస్సీ లబ్దిదారులు వివిధ రకాల వాహనాలను రుణాలుగా తీసుకున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి రూ.1.92కోట్ల సబ్సిడీ నిధులు రావాల్సి ఉంటుంది. ఎస్టీ లబ్దిదారులు 2020 నుంచి 2024 ఏడాది వరకు 46మంది రుణాలు తీసుకోగా వీరికి గాను ఈ నాలుగేండ్లలో రూ5.55కోట్లు ప్రభుత్వం నుంచి రాయితీ రావాల్సి ఉంది. ఇక వికలాంగులు 2020 నుంచి 2023 వరకు ఇద్దరు లబ్దిదారులు వాహనాలు తీసుకోగా వీరికి ప్రభుత్వం నుంచి రూ.13.85లక్షల మేర రాయితీ రావాల్సి ఉంది. గత నాలుగేండ్ల నుంచి ఇప్పుడు..అప్పుడు వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నా సబ్సిడీ నిధులు మాత్రం దరిచేరడం లేదు. పలు దఫాలుగా జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయానికి వచ్చి వాకాబు చేస్తున్నారు. కానీ సబ్సిడీ రాలేదనే సమాధానం వస్తుండటంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. కనీసం కొత్త ప్రభుత్వమైనా లబ్దిదారుల సమస్యను గుర్తించి రాయితీ నిధులు విడుదల చేస్తే వారు పడుతున్న ఆర్థిక సమస్యలకు పరిష్కారం లభించినట్లవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండల కేంద్రానికి చెందిన ఈయన పేరు పొచ్చన్న. జీవనోపాధి కోసం 2019లో పరిశ్రమలశాఖ ద్వారా సబ్సిడీ సౌకర్యంతో బ్యాంకులో రూ.32లక్షల రుణం తీసుకొని జేసీబీ కొనుగోలు చేశారు. ఈయనకు తీసుకున్న రుణానికి ప్రభుత్వం నుంచి 35శాతం అనగా రూ.9.70లక్షల మేర సబ్సిడీ రావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు దరిచేరలేదు. దీంతో ప్రతి నెలా బ్యాంకులో రూ.50వేలు కిస్తీలు(ఈఎంఐ) చెల్లించి రుణం తీర్చేశారు. కానీ ఇప్పటికీ సబ్సిడీ రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వారు జిల్లాలో అనేక మంది ఉండటం గమనార్హం.



ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం : పద్మభూషణ్‌రాజు, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి,ఆదిలాబాద్



ఎస్సీ,ఎస్టీ, వికలాంగులు పొందిన రుణాలకు సంబంధించి రాయితీ నిధులు విడుదల కావాల్సి ఉంది. గత నాలుగేండ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. లబ్దిదారులకు రావాల్సిన సబ్సిడీ నిధుల విషయం ఇది వరకే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినాం. అక్కడ్నుంచి విడుదల కాగానే లబ్దిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటాం.

నేడు జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

- 5191 మంది విద్యార్థులు, 24 పరీక్ష కేంద్రాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2025-26 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు ఇప్పటికే విద్యాలయ సమితి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేపట్టింది. ఉమ్మడి జిల్లాకు చెందిన జవహర్ నవోదయ విద్యాలయం కాగజ్‌నగర్‌లో ఉంది. రాబోయే విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి గత ఆగస్టు నెలలోనే విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 5 వేల 191 మంది పరీక్ష రాయనుండగా వారికి కోసం 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11.30 గంటల నుండి 1గంట30 నిమిషాల వరకు పరీక్ష కొనసాగుతుంది. ఇప్పటికే హాల్ టికెట్లను ఆన్లైన్‌లో పొందుపరిచారు. ఇదిలా ఉంటే కొత్త జిల్లాల్లో ప్రవేశ పరీక్షకకు సంబంధించి సన్నాహక సమావేశాలు పూర్తి చేశారు.



సమయానికి కేంద్రాలకు చేరుకోవాలి : డీఈఓ ప్రణీత

జిల్లాలో నవోదయ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశాం. జిల్లా వ్యాప్తంగా 1170 మంది విద్యార్థులకు 5 కేంద్రాలను ఏర్పాటు చేశాం. జిల్లా కేంద్రంలో గర్ల్స్ హైస్కూల్, లిటిల్ ఫ్లవర్, చావర అకాడమీతో పాటు ఇచ్చోడ, ఉట్నూర్‌లో కేంద్రాలను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాం. పరీక్షల సూపరింటెండెట్లు, పరిశీలకులను కూడా నియమించాం. విద్యార్థులు పరీక్ష సమయానికి కేంద్రాలకు చేరుకోవాలి. ఆలస్యమైతే కేంద్రాల్లోకి అనుమతి ఉండదు.

ఓరియంట్ గుర్తింపు సంఘం ఎన్నికలపై సమావేశం



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలపై శుక్రవారం ఆదిలాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డీసీఎల్ ఎ.రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి మెజార్టీ నాలుగు యూనియన్ల తరుపున ప్రతినిధులు హాజరయ్యారు. ప్రస్తుతం ఓరియంట్ సిమెంట్ కంపెనీని ఆదానీ గ్రూపులు కొనుగోలు చేయడంతో యాజమాన్యం మార్పు పక్రియ కొనసాగుతుండగా ఎన్నికలు వాయిదా వేయాలని ఓరియంట్ యాజమాన్యం తరుపున అధికారులు కోరారు. ఎన్నికలు నిర్వహించాలని మెజార్టీ యూనియన్లు కోరాయి. ఒక యూనియన్ ఉద్యోగుల సంతకాలతో కూడిన ప్రాతినిధ్య పత్రాలను అందజేశారు. సమావేశానికి హాజరైన ఓరియంట్ సిమెంట్ పర్మినెంట్ వర్కర్స్ యూనియన్, ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్, తెలంగాణ ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్, ది లోకల్ ఓరియంట్ సిమెంట్స్ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్ నాలుగు యూనియన్ల ప్రతినిధులు హాజరు కాగా మెజార్టీగా ఎన్నికలు నిర్వహించాలని కోరడంతో మెజార్టీ యూనియన్ల అభిప్రాయాన్ని అధికారులు స్వీకరించారు. ఈ మేరకు జనవరి 28వ తేదీ మరో సమావేశం నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. జనవరి 28న ఎన్నికలపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నట్లు సంకేతాలున్నాయి. అదే రోజు విధి విధానాలు ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గుర్తింపు సంఘం ఎన్నికలు లేక మూడేళ్లు అవుతోంది. దీంతో కార్మికుల సమస్యలు తీరడం లేదని, ఎన్నికలు నిర్వహించాలని కార్మికులు కోరుతున్నారు.

లేగ దూడపై చిరుత దాడి



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని దుప్య తండా గ్రామానికి చెందిన జాదవ్ ప్రేమ్‌కుమార్‌కు చెందిన లేగ దూడపై గురువారం చిరుత పులి దాడి చేసి చంపేసింది. అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం వారు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. బాధిత రైతుకు నష్ట పరిహారం అందజేస్తామని డిఫ్యెఆర్‌ఓ నజీర్‌ఖాన్ అన్నారు. రైతులు, పశు కాపరులు అటవీ అంచుల్లోని పట్టా చేనులోకి ఒంటరిగా వెళ్లొద్దని తండా వాసులకు సూచించారు. ఆయన వెంట బీట్ ఆఫీసర్ సుజాత ఉన్నారు.

దోపిడీ, పేదరికం, నిరుద్యోగానికి బూర్జువా పార్టీలే కారణం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి



నవతెలంగాణ-నస్పూర్

దోపిడీ, పేదరికం, నిరుద్యోగానికి కారణం బూర్జువా పాలకవర్గ పార్టీలేనని, కమ్యూనిస్టు పార్టీ రాజ్యాధికారంతోనే దేశం అభివృద్ధి చెందుతుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర నాలుగో మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడిచినా నేటికీ దేశ పరిస్థితులు ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు పాలించిన బూర్జువా పార్టీలతో దేశం, రాష్ట్రం, జిల్లా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కేవలం వారి వెనుకాల ఉండే కార్పొరేట్ సంస్థల అధినేతలకు గులాం గిరి చేస్తూ వారిని మరింత సంపన్నులుగా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల ప్రజలు స్వాతంత్ర్య ఫలాలను పొందలేకపోయారని పేర్కొన్నారు. విద్య, వైద్యం వ్యాపారంగా మారిపోవడంతో ప్రజల ఆరోగ్యాలు క్రమంగా దెబ్బతింటున్నాయన్నారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, యువత, విద్యార్థుల్లో గంజాయి, డ్రగ్స్ సంస్కృతి పెరగడం, మహిళలపై లైంగిక దాడులు, హత్యలు పెరిగిపోవడానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలే కారణమని తెలిపారు. ఈ బూర్జువా పార్టీలను పక్కన పెట్టాలన్నారు. కమ్యూనిస్టు పార్టీని అధికారంలోకి తెచ్చుకున్నప్పుడే పేద ప్రజలు మంచి ఫలితాలు పొందుతారని పేర్కొన్నారు. జనవరి 25 నుంచి 28 వరకు జరిగే సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల్లో ఈ విషయాలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బోడెంకి చందు, దుంపల రంజిత్‌కుమార్, దూలం శ్రీనివాస్, నాయకులు బోండ్ల సరిత, కాసిపేట రాజేశం, సతీష్ పాల్గొన్నారు.

గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-ఉట్నూర్

గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, ఎన్నికల వేళ ఇచ్చిన ప్రతి హామీని దశల వారీగా నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి గ్రామంలో రోడ్డు, డ్రైనేజీ, నీటి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. గత ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని పక్కగా అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంతరావు, ఆర్టీఎ జిల్లా సభ్యులు దూట రాజేశ్వర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇక్బాల్, మాజీ సర్పంచులు భీమన్న, జగదీష్, కాంగ్రెస్ నాయకులు దాసండ్ల ప్రభాకర్, రాజేష్, మహేందర్, గ్రామ పటేళ్లు పాల్గొన్నారు.

ఆదివాసుల సమస్యలపై 21న చలో హైదరాబాద్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 21న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీఏజీఎస్ (తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆదివాసీ వ్యతిరేక విధానాలను తీవ్రంగా నిరసించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాల్లో ఆదివాసుల రిజర్వేషన్ తొలగింపును వ్యతిరేకించారు. ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని, ఐదవ షెడ్యూల్ ప్రాంతంలోని ఆదివాసుల అభివృద్ధి విద్య, వైద్యం, భూములకు పట్టాలు, ఉద్యోగ కల్పన, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 21న ఇందిరా పార్క్ ఎదుట జరిగే ఆదివాసుల మహాగర్జనను జయప్రదం చేయాలని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పదేండ్ల పాలనలో ఆదివాసీ హక్కులను తొలగించడం, చట్టాలను నీరుగార్చడం, ఆదివాసులను అడవి నుండి, భూమి నుండి నిరాశ్రయులను చేయడం, అడవుల ప్రైవేటీకరణ పేరుతో నూతన అటవీ చట్టం తీసుకొచ్చి ఆదివాసుల గ్రామసభ 1/70, 5వ, 6వ షెడ్యూల్ హక్కులను కాలరాస్తోందని పేర్కొన్నారు. ఈ పదేండ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలలో ఆదివాసుల రిజర్వేషన్ క్రమంగా తగ్గించడం, ప్రైవేట్ ఏజన్సీల ద్వారా కాంట్రాక్ట్ పద్ధతుల్లో ఏజన్సీ ప్రాంతాల్లో ఉద్యోగాల భర్తీ చేపట్టి గిరిజన రిజర్వేషన్స్ లేకుండా చేస్తోందన్నారు. రైల్వే, బ్యాంకింగ్, ఎల్ఐసి, ఎండిఎం, ఆశా, అంగన్వాడీ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో కొత్త ఉద్యోగాలు ప్రైవేట్ ఏజన్సీల ద్వారా భర్తీ చేపట్టడం వల్ల అందులో ఎస్టీ రిజర్వేషన్ అమలు కావడం లేదన్నారు. ఫలితంగా గిరిజన యువత తీవ్రంగా నష్టపోతోందన్నారు. ఇది పూర్తిగా రిజర్వేషన్లను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్ర అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఏర్పాటు చేసిన ఐటిడిఎల స్వయం ప్రతిపత్తి ప్రశ్నార్థకంగా మారిందని, ఐటిడిఏ ఉత్సవ విగ్రహంగా మారిందని తెలిపారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, అటవీ హక్కుల చట్టం అమలు కోసం రోడ్డు మ్యాప్ ప్రకటించాలని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం హక్కు పత్రాలు అందరికీ ఇవ్వాలని తెలిపారు. తునికాకు దొరికే అన్ని చోట్ల ఆకు సేకరణ జరపాలన్నారు. ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ వేయాలని, జీవో ఎంఎస్ నెం.3ను పునరుద్ధరించాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, వలస ఆదివాసులకు ఎస్టీ సర్టిఫికెట్ ఇవ్వాలని, గిరిజనులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, ప్రతి గిరిజన కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని, రైతుబంధు వర్తింపజేయాలని, రేషన్‌కార్డు లేని గిరిజనులందరికీ రేషన్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కోవ శకుంతల, మంజుల, నాయకులు స్వామి, ఆశన్న, మోహన్ పాల్గొన్నారు.

యువత సమస్యలపై నిరంతరం పోరాడాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

యువత సమస్యలపై ప్రజాసంఘాల నాయకులు నిరంతరం పోరాటం చేయాల్సి ఉంటుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఏఐవైఎఫ్ క్యాలెండర్‌ను ఆ సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంఘాలు సమస్యలపై నిరంతరం పోరాటం చేయడంతో పాటు వాటి పరిష్కారం కోసం ప్రయత్నాలు చేయాలన్నారు..రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాల భర్తీ జరపాలని, ప్రభుత్వం నిరుద్యోగుల పక్షాన నిలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, కొదురుపాక మహేష్, జిల్లా సహాయ కార్యదర్శి గోగర్ల మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షులు, ఏఐవైఎఫ్ నాయకులు రాపర్తి భాస్కర్, చెన్నూరి సాయికుమార్, రాకేష్, హస్వీక క్లారా పాల్గొన్నారు.

అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ మున్సిపాలిటీలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్లు శుక్రవారం మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. రేషన్



కార్డు కోసం లబ్దిదారులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ అధికారులు కొందరికి మాత్రమే మంజూరు చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా పట్టణంలోని శివారు కాలనీలలో సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. దీనిలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్‌తో పాటు స్థానిక కౌన్సిలర్‌లు రమణ, రాజు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా అమలు చేస్తున్న కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని అసిస్టెంట్ లెబర్ కమిషర్ ముత్యంరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన వారికి ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంక్షేమ మండలికి రూ.7 చెల్లించిన కార్మికులు దీనికి అర్హులని చెప్పారు. ఫిబ్రవరి 15లోగా దరఖాస్తులను కార్యాలయంలో అందించాలని సూచించారు. కార్మికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదో తరగతి నుంచి ఎంబీబీఎస్ వరకు వెయ్యి రూపాయల నుంచి రెండు వేల రూపాయల వరకు ఉపకార వేతనం వస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

ఎకలో అణోచ ఎకలో జాణోచ్ పాట విడుదల



నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని అనిష్ ఫోటో స్టూడియోలో శుక్రవారం కవన కోకిల జాదవ్ బంకట్ లాల్ గానం చేసిన ఎకలో అణోచ ఎకలో జాణోచ్ పాటను రాథోడ్ భీంరావ్ నాయక్, బంజారా రచయితల వేదిక అధ్యక్షులు డాక్టర్ ఇందల్ సింగ్ బంజారా, లైవ్ నాయకులు జాదవ్ వసంత్, బానోతు రవీందర్, ప్రొడ్యూసర్ సేవాదాస్, పరమేశ్వర్ చవాన్, జాదవ్ మురళి, పవార్ వినోద్‌లు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాథోడ్ భీంరావ్ నాయక్ మట్లాడుతూ కవన కోకిల జాదవ్ బంకట్ లాల్ బంజారా రచయితల వేదిక గౌరవాధ్యక్షులు బంజారా సమాజానికి తన గానంతో, రచనలతో ఆనందింప జేయడమే ఏకైక లక్ష్యంతో ముందుకు వెళుతున్నారని ఎలాంటి ఫలం ఆశించకుండా సమాజానికి సేవ చేయాలనే తపన వారిలో ఉంటుందని చెప్పారు. డాక్టర్ ఇందల్ సింగ్ బంజారా మాట్లాడుతూ కవన కోకిల జాదవ్ బంకట్ లాల్ బంజారా సమాజానికి లభించిన ఆణిముత్యం లాంటి కళాకారులని ప్రశంసించారు ఈ కార్యక్రమంలో గోవింద్, అర్జున్, రవీందర్ పాల్గొన్నారు.

ఆశిష్ లైవ్ ఈవెంట్స్ షాప్ ప్రారంభం



నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని సేవాదాస్ నగర్‌లోని రమేష్ రాథోడ్ కాంప్లెక్స్‌లో నూతన ఆశిష్ లైవ్ ఈవెంట్స్ షాప్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్, ఉట్నూర్ మండల ఫోటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు చవాన్ సేవాదాస్ మాట్లాడారు. ఉట్నూర్ పట్టణ పరిసర ప్రాంతాలకు ఎల్ఈడీ వాల్ సౌకర్యం ఉండాలనే ఉద్దేశంతో షాప్ ఓపెన్ చేయడం జరిగిందన్నారు. లైవ్ ఈవెంట్స్ కావాలని అనుకునే వారు షాప్‌కి వచ్చి ఆర్డర్ ఇవ్వచ్చని అన్నారు. కార్యక్రమంలో షాప్ యాజమాని ప్రహ్లాద్, ఉట్నూర్ మండల ఫోటోగ్రాఫర్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి రూబెన్, సాయి, రాజ్ కేంద్రే, సంజయ, ప్రశాంత్, సత్యం, విజయ, రాథోడ్ గణేష్ పాల్గొన్నారు.

మోకుదెబ్బ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని గీత పారిశ్రామిక సహకార సంఘ భవనంలో మోకుదెబ్బ జాతీయ కమిటీ-2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు ప్లావల గోపిగౌడ్, ముఖ్య అతిథులుగా మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మెన్ అమరవేణి నర్సాగౌడ్, జాతీయ ముఖ్య సలహాదారులు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కోల జీవన్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. రాజ్యాధికారం సాధనకై గౌడ కులస్తులు రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పోటీ చేసి గెలువాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు పడాల రాజేందర్‌గౌడ్, కొండ బాలగౌడ్, యాగండ్ల దశాగౌడ్, తీగెల వెంకట్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివ్వోల్ల రవీందర్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి కొండ మురళిగౌడ్, జిల్లా నాయకులు, ఉప్పునూతుల వేణు గోపాల్‌గౌడ్, టి.గణేష్ గౌడ్, ఏ.రమేష్‌గౌడ్, ఎం.దేవేందర్‌గౌడ్, జి.వినోద్‌గౌడ్, డి.సాయి బాబాగౌడ్, ఉప్పునూతుల లక్ష్మి నారాయణగౌడ్, మనోహర్‌గౌడ్, యు. శ్రీనివాస్ గౌడ్‌లతో పాటు పలువురు గౌడ కులస్తులు పాల్గొన్నారు.

ఖాందేవ్ ఆలయ ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణం



నవతెలంగాణ-నార్నూర్

ఖాందేవ్ ఆలయ ఆవరణలో రూ.3లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు ఆలయ కమిటీ సభ్యులు తీర్మానించినట్టు శుక్రవారం ఎంపీడీఓ జవహార్‌లాల్, మిషన్ స్వచ్ఛ భారత్ జిల్లా కోఆర్డినేటర్ సందీప్ తెలిపారు. స్వచ్ఛ భారత్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులలో చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. దీనికి సంబంధించి మండల కేంద్రంలోని ఖాందేవ్ ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ చైర్మెన్ తొడసం నాగోరావ్‌తో కలిసి నిర్మాణ పనులకు కొలతలు ఇచ్చారు. భక్తుల సౌకర్యార్థం కోరకు పనులు చేపడుతున్నట్టు గడువులోగా పనులు పూర్తి చేయాలని కోరారు. ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులకు శాలువాతో సన్మానం చేశారు. ఇందులో ఏపీఓ జాదవ్ సురేష్, టీఏ సచిన్, కైలాష్ మాజీ ఎంపీపీ మెస్రం రూపదేవ్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

అర్హులైనవారికే సంక్షేమ పథకాలు

- మంత్రి సీతక్క



నవతెలంగాణ-నిర్మల్

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంక్షేమ పథకాల అమలుపై ఉమ్మడి జిల్లా స్థాయి ప్రణాళిక కార్యాచరణ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అభిలాష అభినవ్, రాజార్షిషా, కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, రామారావ్‌పటేల్, పాయల శంకర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన మంత్రికి జిల్లా కలెక్టర్ పూల మొక్కతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాలు అర్హులకే అందేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. జనవరి 26 నుంచి ప్రారంభించనున్న పథకాలను రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేసి, లబ్దిదారులను పకడ్బందీగా ఎంపిక చేయాలన్నారు. అర్హులైన వారందరికీ పథకాలు అందజేసే భాధ్యత అధికారులదేనన్నారు. రైతుభరోసా పథకానికి సంబంధించి సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించాలని ఆదేశించారు. గ్రామాల్లో గ్రామ సభలు, పట్టణాల్లో వార్డు సభలను నిర్వహించి, గుర్తించిన అర్హుల వివరాలను వెల్లడించాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. అలాగే ఉమ్మడి జిల్లాలో నిరుపేదలందరికీ మెరుగైన విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యం, తదితర వసతులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్లను మంత్రి సీతక్క, కలెక్టర్లు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు రాజర్షిషా, కుమార్ దీపక్, వెంకటేష్ ధోత్రే, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, నిర్మల్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా, శ్యామలదేవి, దీపక్ తివారి, ఎమ్మెల్యే రామారావ్ పటేల్, పాయల శంకర్, అనిల్ జాదవ్, మున్సిపల్ చైర్మెన్‌లు గండ్రత్ ఈశ్వర్, మేడిపల్లి సత్యం, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సయ్యద్, అర్జుమంద్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మెన్లు ప్రజాప్రతినిధులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తొలగని కార్మికుల ఇబ్బందులు

- మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో అన్ని రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచిన ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను మాత్రం విస్మరించిందని మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసు రత్నం అన్నారు. పాలకులు మారిన కార్మికుల ఇబ్బందులు మారడం లేదన్నారు. శుక్రవారం యూనియన్ జిల్లా 3వ సభను జిల్లా కేంద్రంలో ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయం నుంచి బ్యాండ్ మేళాల నడుమ నినాదాలు చేస్తు సభ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న, ఏఐటీయూసీ నాయకులతో హాజరై అభివాదం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడారు. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. పాలకులు మారుతున్న వీరి ఇబ్బందులు మాత్రం తొలగడం లేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వేతన సవరణ చేయాలన్నారు. అదే విధంగా కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీను అమలు చేయాలన్నారు. కర్నాటక, మద్రాస్, కేరళ తరహాలో ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ కార్మికుల కోసం పోరాడే ఏకైక సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. ఐక్యంగా ఉండి హక్కుల కోసం ఉద్యమిస్తే ఏ ప్రభుత్వమైన దిగి వస్తుందన్నారు. తను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత తన శక్తి మెరకు మున్సిపల్ కార్మికుల సమస్యలపై స్పందించడం జరిగిందని గుర్తు చేశారు. అధికారంలో లేక పోయిన కార్మికులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనపల్లి జైపాల్ రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, జిల్లా డిప్యూటి ప్రధాన కార్యదర్శి గజంగుల రాజు, ఫయాజ్, మల్లేష్, ముత్యం, పొశెట్టి, బీఆర్ఎస్ నాయకులు రాజన్న, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుభాష్ చంద్రను ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మాసమాజ్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా బోథ్ మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని అనేక ధర్నా కార్యక్రమాలు రాస్తారోకోలు నిర్వహించడం జరిగిందన్నారు. అయినా బోథ్ మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు గురించి, గత ప్రభుత్వం కానీ ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం కాని ఫైర్ స్టేషన్ ఏర్పాటు గురించి మండల అభివద్ధి గురించి విస్మరిస్తున్నాయని అన్నారు. ఫైర్ స్టేషన్ లేని కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో ఉన్నటువంటి ప్రజలు రైతులు లక్షల ఆస్తి నష్టపోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం నుంచి స్పందన లేని పక్షంలో పెద్ద ఎత్తున మండలంలో భారీ ఎత్తున ధర్నా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ మండలాధ్యక్షుడు కొండమడుగు గణేష్, నాయకులు బిక్క రమేష్, కుందూరు సుధాకర్, పెందూరు జల్‌దేవ్, కృష్ణపెళ్లి స్వామి, పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ ఈబీసీ డిగ్రీ పాసైన అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ అండ్ బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు బీసీ జిల్లా అభివృద్ధి అధికారి రాజలింగు, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులు జనవరి 20 నుంచి ఫిబ్రవరి 9 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉచిత శిక్షణ 15 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నాలుగు నెలల ఉచిత శిక్షణ ఉంటుందని, అభ్యర్థులు ఆన్లైన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీబీసీస్టడీసర్కిల్.సీజీజీ.గావ్.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షా 50వేలలోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలలోపు ఉండాలని, అభ్యర్థుల ఎంపిక విధానం రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 08732-221280 నెంబర్ సంప్రదించాలని సూచించారు.

చెరువులో స్నానానికి వెళ్లి పశువుల కాపరి మృతి

నవతెలంగాణ-బోథ్

చెరువులో స్నానానికి వెళ్లి పశువుల కాపరి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని కంఠేగాం గ్రామానికి చెందిన భర్దవల్ రామేశ్వర్(19) మతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని చెరువులో పశువుల కాపరి స్నానం కోసం దిగి ఈత రాక మృతి చెందాడు. మహారాష్ట్రలోని చంద్రపూర్ సమీపంలోని డోంగర్‌గావ్ గ్రామానికి చెందిన మృతుడు కుటుంబీకులతో కలిసి ఆయన పశువుల కాపరిగా జీవనం సాగిస్తున్నారు. మృతుడు శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో సాభ్లే అమర్‌సింగ్, పండరి, అంకుశ్‌లతో కలిసి కంఠేగాం చెరువుకి స్నానం చేయడానికి వెళ్లారు. కాగా రామేశ్వర్ చెరువులోని లోతైన ప్రాంతంలోకి వెళ్లడంతో ఈతరాక నీటిలో మునిగిపోయాడు. అమర్ సింగ్, అంకుశ్‌లకు సైతం ఈత రాకపోవడంతో వారు అతన్ని కాపాడలేకపోయారన్నారు. బోథ్ నుంచి గజ ఈత గాళ్లను తీసుకువచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

కొలాం, గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని జెండాగూడ, మొగ్రిపేట్, శివగూడ గ్రామాలలోని కొలాం, నాయక్ పోడు గిరిజనులకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శుక్రవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ ప్రాంతంలోని నిరుపేదలకు సేవ చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామాలలో పెరుగుతున్న చలిని దృష్టిలో ఉంచుకొని నిరుపేద కొలాం, నాయక్‌పోడు గిరిజనులకు తమవంతుగా దుప్పట్లను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బానోత్ జైవంతరావు, ఆర్టీఏ జిల్లా సభ్యులు దూట రాజేశ్వర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, ఉట్నూర్ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇక్బాల్, మాజీ సర్పంచ్లు భీమన్న, జగదీష్, కాంగ్రెస్ నాయకులు దాసండ్ల ప్రభాకర్, రాజేష్, మహేందర్, గ్రామ పటేల్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



నవతెలంగాణ-సారంగాపూర్

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన శుక్రవారం మండలంలోని బీరవెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గాడి లక్ష్మీ, గుండ్లా పెద్దమ్మాయి తమ ఇంటికి తాళలు వేసి పనిపై బయటకు వెళ్లారు. అదే సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగాయి. ఇంట్లో నుంచి దట్టమైన పొగలు వస్తుండటంతో స్థానికులు గమనించి, వెంటనే తలుపులు పగలగొట్టి మంటలను నీళ్లతో ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రెండు ఇండ్లలోని గృహోపకరణలు, వస్తువులతో పాటు నిత్యావసర సరుకులు కాలి బూడిదయ్యాయి. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి



నవతెలంగాణ-బోథ్

గ్రామ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కనుగుట్టా గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలోని ఉన్న సమస్యలు విన్నవించారు. గ్రామంలో హైమస్ట్ లైట్లు, సీసీ రోడ్డు లు శ్మశాన వాటిక వద్ద నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే గ్రామ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మునిగెల రమేష్, నాయకులు నవ్వ రవీందర్, బీమ బుచ్చన్న, నవ్వ రాజు, బోడ లక్ష్మణ్ పాల్గొన్నారు.

20న ఆదివాసీ సంక్షేమ మహాధర్నా



నవతెలంగాణ-తాంసి

ఆదివాసీ సంక్షేమ పరిషత్ చలో ఉట్నూర్ మహా ధర్నాను విజయవంతం చేయాలని శుక్రవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ తాంసి మండల తుడుం దెబ్బ అధ్యక్షులు ఆత్రం భరత్ చలో ఉట్నూర్ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న చలో ఉట్నూర్ మహా ధర్నా ఆదివాసీ సంక్షేమ పరిషత్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ ధర్నాను ప్రతి ఆదివాసి సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. 1/70 పేసా, అటవీ హక్కులు, ఏజెన్సీ ప్రాంత వ్యక్తులకు పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధన కోసం నిర్వహించే ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

నాగోబా జాతర నిర్వహణకు తైబజార్ వేలం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా జాతర ఏర్పాటు చేసే తైబజార్‌కు మండల అధికారులు శుక్రవారం కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా దర్బార్ హాల్లో వేలం పాట నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా, తైబజార్ నిర్వాహకును రూ.7లక్షల 26వేలకు కేంద్రే అవధూత్ దక్కించుకున్నారు. అలాగే జాతరలో దుకాణ సముదాయాలకు విద్యుత్ సరఫరాకు రూ.2లక్షల ఒక వేయికి ఎండీ బాబా, జాతరలో ప్యాలాలు, పుట్నాల కోసం రూ. 50వేలకు టి.నరేష్, జాతరలో కొబ్బరి కాయల విక్రయానికి రూ. 20వేలు బి.శివా వ్యాపారస్తులు దక్కించుకున్నట్టు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. నాగోబా జాతరలో మొత్తం వేలంపాట ద్వారా రూ.9 లక్షల 97వేల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ కమిటీ ఈఓ రాజమౌళి, ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు పటేల్, మాజీ సర్పంచ్ మెస్రం రేణుక నాగనాథ్, మాజీ ఆలయ కమిటీ చైర్మెన్ మెస్రం తుకారాం, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
3
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | జనవరి 18, 2025 | www.navatelangana.com

వ్యవసాయ కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 2025 క్యాలెండర్‌ను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను సబ్ కలెక్టర్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

జాతర వేడుకల్లో మాజీ ఎంపీపీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని ఉల్లిపిట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని జెండాగూడ గ్రామంలో చీకటి భీమయ్యక్ జాతర వేడుకల్లో మాజీ ఎంపీపీ అరిగేల మల్లికార్జున్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించి వాలీబాల్ పోటీలకు సంబంధించిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జాతరలు సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్స్ పటేల్, రంజిత్ యాదవ్, కోటగొల్ల పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని ఏటిగూడ గ్రామానికి చెందిన ఎర్నాగి చిన్నన్న అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం బిజెపి నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఆదే అశోక్, తొర్రెం జలపతి, ఇప్పకాయల శంకర్, తలండి రాములు, అన్నారం తిరుపతి, సామల తిరుపతి పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా సర్వే చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పొరపాట్లు లేకుండా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు. శుక్రవారం మండలంలోని వంజరి గ్రామంలో రైతు భరోసా సర్వేను ఆమె పరిశీలించారు. ఎలాంటి తప్పులు జరగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి తెలియజేశారు. వివరాలు పూర్తి స్థాయిలో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షులుగా రామన్న

నవతెలంగాణ-చింతలమానేపల్లి



బిజెపి మండలాధ్యక్షులుగా డోకే రామన్న నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, ఎమ్మెల్యే హరీష్‌బాబు తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పెద్దలు, తోటి కార్యకర్తలందరీ సహకారంతో పార్టీ అభ్యున్నతికి పాటుపడతానని పేర్కొన్నారు.

25లోగా ట్యూషన్ ఫీజు చెల్లించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024-25 సంవత్సరంలో డిగ్రీ 2, 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు ఇంతవరకు చెల్లించని వారు ఈ నెల 25లోగా చెల్లించవచ్చని ప్రిన్సిపాల్ శ్రీదేవి, కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు యూనివర్సిటీ అవకాశం ఇచ్చిందని, ఇంతవరకు ట్యూషన్ ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9494314314, 9160144943, 9866398678 సెల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆదిలాబాద్‌లో ఎక్సైజ్ అధికారుల స్పెషల్ డ్రైవ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ ఆఫ్ ఎన్ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుండి ఫిబ్రవరి 15వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి హిమశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా జిల్లాలో నాటుసారా తయారీ కేంద్రాలను గుర్తించి తయారీ, ముడిసరుకు రవాణాదారులపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దేశీదారు రవాణా విషయంలో ఇలాగే కఠినంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కచ్చితమైన ప్రణాళికలు రూపొందించి ఈ డ్రైవ్‌ను పకడ్బందీ అమలు చేస్తామని పేర్కొన్నారు.

మండల మాదిగ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కౌటాల

మండల మాదిగ కమిటీని శుక్రవారం రాష్ట్ర చైర్మన్ పొకల కిరణ్ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర సలహాదారు ఇరిగిరాల భాస్కర్ మాదిగ ఆధ్వర్యంలో మండల కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సిద్దల బాపు మాదిగ అధ్యక్షుడిగా ఇప్ప తిరుపతి మాదిగ ఉపాధ్యక్షుడిగా నక్క మహేష్ మాదిగ అవునూరి రాజ్ కుమార్ మాదిగ ప్రధాన కార్యదర్శిగా అయిల్ల తిరుపతి మాదిగ, కోశాధికారిగా రెకుంట స్వామి మాదిగ, ప్రచార కార్యదర్శిగా ముల్కల్ల తిరుపతి మాదిగ ఎన్నికయ్యారు.

రుణమాఫీ పూర్తి చేయకుంటే ఉద్యమిస్తాం

- టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 31లోపు రుణమాఫీ చేయకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి టీఏజీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం డిఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ అధికారుల పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రైతు రుణమాఫీ ఆదివాసీ జిల్లాలో సక్రమంగా అమలు కాలేదని పేర్కొన్నారు. దీనికి ప్రధాన కారణమైన వ్యవసాయ అధికారులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామాలలో కూడా రుణమాఫీ అమలు కాకపోతే దూర ప్రాంతాల రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తాము క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు అనేకమంది రైతులు తమ గోడు వెళ్లబుచ్చుకున్నారని తెలిపారు. వట్టివాగు ఆదివాసీ మహిళా రైతు కొరెంగ బూర్జుబాయి పేరును వ్యవసాయ అధికారులు రికార్డులలో భానుబాయిగా మార్చడంతో ఆమె రుణమాఫీ కాక ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోందని తెలిపారు. కౌటాగూడ గ్రామానికి చెందిన ఆత్రం బాపురావు కుటుంబం రూ.3.20లక్షల రుణం ఉండటంతో అధికారులు రూ.1.20లక్షలు కట్టమని సూచించడంతో అప్పులు చేసి రుణం కట్టినప్పటికీ రుణమాఫీ కాలేదన్నారు. ఇది కేవలం ఉదాహరణలు మాత్రమే ఇటువంటివి జిల్లాలో అనేకం ఉన్నాయని తెలిపారు. జిల్లా ఇన్చార్జి మంత్రిగా ఉన్న ఆదివాసీ మహిళ సీతక్క ఆదివాసీ జిల్లా కోసం ప్రత్యేకంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని, తప్పులు చేసిన వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకొని రైతులందరికీ వెంటనే రుణమాఫీ అయ్యేలా చూడాలని, లేనిపక్షంలో జనవరి 31 తర్వాత ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు కొరెంగ మాలశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మడావి గణపతి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయికృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ చాపిడి శ్రావణి, జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, టీఏజీఎస్ నాయకులు మరప హన్మంతు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి దుర్గం అనిత, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



సమగ్ర సర్వే వేతనం ఇవ్వాలి

- టీఎస్‌యూటీఎఫ్, పీఆర్టీయూ వినతులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాలు వేరువేరుగా అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ మధుకర్‌కు జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి అధ్యక్షతన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే వివరాలను నవంబర్‌లో ఉపాధ్యాయులు పూర్తిచేసినప్పటికీ సర్వేకు చెల్లించాల్సిన మొత్తం నేటికి చెల్లించకపోవడం దారుణం అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మొత్తాన్ని చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇందురావు, కోశాధికారి రమేష్, నాయకులు హేమంత్ షిండే, సుభాష్, నవీన్ పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో

కుటుంబ సర్వేతో పాటు మే నెలలో నిర్వహించిన పార్లమెంటు ఎన్నికల విధులకు సంబంధించిన మొత్తాలు వెంటనే చెల్లించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జిల్లా విద్యా అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే మాసంలో పార్లమెంటరీ ఎన్నికలు విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలన్నారు. నవంబర్ మాసంలో కుటుంబ సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సునార్కర్ అనిల్‌కుమార్, నాయకులు ఉప్పల నరసింహాచారి, మర్యాల ఉదయబాబు, తంగేడిపల్లి రాకేష్, ఇందారపు ప్రకాష్, ఉప్రే వినేష్, గోర్ సింగ్, జాడి జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-తిర్యాణి

వచ్చె నెల ఏడో తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే వేల గొంతుకలు, లక్ష డప్పుల కార్యక్రమాన్ని మండలంలోని మాదిగలందరూ హాజరై విజయవంతం చేయాలని ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్ర సతీష్, జిల్లా అధ్యక్షుడు రేగుంట కేశవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో మాదిగలంతా డప్పులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో గల కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించే వేల గొంతులు, లక్ష డబ్బులు కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఆగస్టు ఏఓ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పును సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం చేస్తున్న పోరాటం ఫలించినప్పటికీ కొంతమంది నాయకులు వర్గీకరణ మీద విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. అడవుల జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్ నుండి హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమానికి ఇంటికో డప్పు చొప్పున తీసుకొని బయలుదేరాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్యాల అశోక్, ఉపాధ్యక్షుడు శేర్ల ఎల్లయ్య, జిల్లా నాయకులు మెరుగు వెంకటేశం, నాయకులు చిలక రాయలింగు, గద్దెల బాబు, షేర్ల లింగేష్, అంజయ్య ఆశాలు పాల్గొన్నారు.



జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి



నవతెలంగాణ- కాగజ్‌నగర్

పట్టణంలోని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ శుక్రవారం కాగజ్‌నగర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు వినతి పత్రం అందించారు. 20, 30 ఏళ్లుగా జర్నలిస్టులుగా వివిధ పత్రికల్లో పనిచేస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. డివిజన్ కేంద్రమైన కాగజ్‌నగర్‌లో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన సబ్ కలెక్టర్ ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు టి.సురేందర్‌రావు, ప్రధాన కార్యదర్శి తిరుమలచారి, సభ్యులు జె.మధుకర్, ఎంఎ జమీల్, కె.శ్రీకాంత్, పి.సంతోష్, బి.అనిల్, ఎస్.రాజు, సమీర్, జి.శ్రీనివాస్, జె.రాజు పాల్గొన్నారు.

దిందా బ్రిడ్జి ఘనత మాజీ ఎమ్మెల్యే కోనప్పదే



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని దిందా వంతెన నిర్మాణం కోసం అనుమతులు మంజూరు చేయించిన ఘనత మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకే దక్కుతుందని కాంగ్రెస్ నాయకుడు వీపీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు స్థానిక ఎన్నికలు ఉన్నాయని కొందరు మేము అంటే, మేము అనుమతులు తెచ్చినం అని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఎవరు ఏమి అనేది ప్రజలకు తెలుసు, బీజేపీ పాలన సంవత్సరం గడిచిన ఇంకా ఒక్కటైనా కొత్త పని ప్రారంభించకపోవడం, గతంలో మంజూరైన పనులు చేస్తూ మేమే అనుమతులు తీసుకువచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటు అని దుయ్యబడ్డారు. గతంలో పీఎంజీఎస్‌వై కింద కోనేరు కోనప్ప దిందా బ్రిడ్జితో పాటు భూపాలపట్నం, సోమిని, అంబగట్ట, కుకుడ, గ్రామాలకు బ్రిడ్జ్ అవసరమని ప్రతిపాదనలు పంపించగా 9 ఫిబ్రవరి 2017న కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారికంగా 4 వంతెనలు మంజూరు అయినట్టు అనుముతులు వచ్చాయని తెలిపారు. కేతిని-దిందా, కుకుడ-అంబగట్ట, గూడెం నుండి బెజ్జూర్ రెండు వంతెనలు (సోమిని వద్ద) జీఓ నెంబర్-14 ద్వారా మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. దిందా, సోమిని బ్రిడ్జ్ పనులు మొదలు అవ్వకుండా ఫారెస్ట్ అధికారులు ఆ కాంట్రాక్టర్ కు తీవ్రంగా ఇబ్బంది కలిగించారని అన్నారు. అప్పుడు కాంట్రాక్టర్ పనులు చేయలేక పోవడంవల్ల, పంచాయత్ రాజ్ శాఖ అధికారులు, అటవి అనుమతులకై దరఖాస్తు చేశారని తెలిపారు. ఈ సమావేశంలో సయ్యద్ నాది హుస్సే, డోకే రాజన్న, నారాయణ, జాబరి రాజన్న, చౌదరి చందు, డోకి నారాయణ, జనగారి సత్యనారాయణ పాల్గొన్నారు.

గంజాయి సాగు నిందితుడికి పదేండ్ల శిక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గంజాయి సాగు చేస్తున్న కేసులో నిందితుడికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్ తీర్పు ఇచ్చారు. జైనూర్ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం..కిషన్ నాయక్ తండా చింతకర్ర గ్రామానికి చెందిన రాథోడ్ పూల్ సింగ్ తన పొలంలో గంజాయి సాగు చేస్తూ 2021 అక్టోబర్ 2న పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టేగా శిక్ష విధిస్తూ జిల్లా జడ్జి తీర్పు వెలువరించారు. నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

మహనీయుల ఆశయాలు కొనసాగించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహనీయుల ఆదర్శాలను కొనసాగిస్తూ వారి ఆశయాలకనుగుణంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అభిప్రాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ ఆవరణలో నిర్వహించిన జగద్గురు నరేంద్ర ఆచార్య మహారాజ్ పాదుకా దర్శన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరేంద్ర ఆచార్య మహారాజ్ సేవలు ఎంతో గొప్పవన్నారు. మానవ సేవయే మాధవసేవ అనే నినాదంతో సాగిన గొప్ప వ్యక్తి మహారాజ్ అని కీర్తించారు. అందరూ దైవ మార్గంలో నడవాలని తెలిపారు. అనంతరం సంస్థ ఆధ్వర్యంలో పేదలకు అందించే కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అంతకుముందు స్థానిక సాయిబాబా ఆలయం నుండి పాదుకలను భాజాభజంత్రీల మధ్య భక్తజన సందోహంతో ర్యాలీగా తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు చందనకడ్ బాలాజీ, జిల్లా నిరక్ష్ దిలీప్ గైక్వాడ్, ధర్మక్షేత్ర ప్రముఖులు పండరి చాప్లే పాల్గొన్నారు.

రోడ్డు భద్రత వారోత్సవాలు

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని ఇందాని ఎక్స్‌రోడ్డు వద్ద శుక్రవారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలు, నిబంధనలు పాటించాలని ఎంవీఐ మోహన్, ఏఎంవీ సీహెచ్ రాజమల్లు సూచించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవీఐ చంద్రశేఖర్, రవి, వాహిద్, వాహనదారులు పాల్గొన్నారు.

టీచర్ ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-తిర్యాణి

మండలంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీఆర్‌టీ సాంఘిక శాస్త్రం, పీజీ సీఆర్‌టీ కామర్స్, సివిక్స్, నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరిస్తునట్లు ప్రత్యేకాధికారి స్వప్న శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థులు స్థానిక జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. సీఆర్‌టీకి డిగ్రీ, బీఎడ్‌తో పాటు టెట్ అర్హత ఉండాలని, పీజీ సీఆర్‌టీ ఉద్యోగాలకు సంబధిత సబ్జెక్టులతో పాటు పీజీ, బీఈడీ అర్హత కలిగి ఉండాలని, నర్సింగ్ ఉద్యోగానికి బీఎస్సీ నర్సింగ్ చేసి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 4 నాలుగు గంటలలోపు కేజీబీవీలో ధరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

సర్వేను పరిశీలించిన తహసీల్దార్

నవతెలంగాణ-జన్నారం

మండలం టీజీపల్లి గ్రామ శివారులో సాగుకు యోగ్యంకాని భూములపై అధికారులు నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల వ్యవసాయ అధికారి సంగీత, ఏఈఓ అక్రమ్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శనివారం | జనవరి 18, 2025 | www.navatelangana.com

పంట సాగు చేసిన భూములకే రైతు భరోసా

● తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే



నవతెలంగాణ-హాజీపూర్

పంటలు సాగు చేస్తున్న భూములకే రైతు భరోసా అని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా కార్యక్రమంలో లబ్ధిదారులను ఎంపిక చేయడానికి శుక్రవారం సబ్బేపల్లి గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటన చేసి భూములను పరిశీలిస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి కృష్ణ, ఆర్ఐ యేసయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రసన్నలు పాల్గొన్నారు.

గోదావరిలో మేస్రం వంశీయుల పుణ్యస్నానాలు

● గంగాజలంతో తిరుగు ప్రయాణం



నవతెలంగాణ-జన్నారం

గంగా జలాన్ని సేకరించేందుకు శుక్రవారం మేస్రం వంశీయులు మండలంలోని కలమడుగు గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడ గంగాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. నాగోబా జాతర ప్రారంభానికి వినియోగించే గంగాజలాన్ని తీసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఝరి అనే ప్రత్యేక పాత్రలో గంగాజలాన్ని సేకరించి, కటోడా పెద్దలతో కలిసి ఆ గంగాజలాన్ని పట్టుకొని కేస్లాపూర్‌కు బయలుదేరారు.

ఇంటి పన్ను వసూళ్లు పూర్తి చేయాలి



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల వారిగా ఈ నెల 20లోపు నూటికి నూరు శాతం ఇంటి పన్ను వసూళ్లు పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక ఎంపీఓ శ్రీపతి బాపురావుతో కలిసి శుక్రవారం రామారావుపేట్, ఇందారం గ్రామాలను సందర్శించారు. గ్రామ పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న పారిశుద్ధ్యపు పనుల నిర్వాహన తీరును పరిశీలించారు. ఇంటింటి తడిపొడి చెత్త వేరు వేరుగా సేకరించాలని, గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్లు ఇతర వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. రేషన్ కార్డులు, రైతు భరోసా లబ్ధిదారుల సర్వేను పరిశీలించిన ఆయన అర్హులైన వారికి అన్యాయం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇంటి పన్ను వసూళ్ల వేగవంతం చేసి వసూలైన డబ్బులు ఎప్పటికప్పుడు చలానా ద్వార గ్రామ పంచాయతీ సాధారణ నిధికి జమ చేయాలని సూచించారు. నీటి సరఫరా, పారిశుధ్య పనులకు సంబంధించిన 7 రిజిష్టర్లు పరిశీలించారు. బ్లీచింగ్ పౌడర్ స్టాక్ రిజిష్టర్ పరిశీలించిన ఆయన ఎంత మోతాదులో బ్లీచింగ్ పౌడర్ కలుపుతున్నారో రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. స్టాక్ వివరాలకు సంబంధించిన రిజిష్టర్లు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, సెగ్రిగేషన్ షెడ్‌ను సంధర్శించిన ఆయన కంపోస్టు ఎరువ తయారీ తీరును పరిశీలించారు. ఇక్కడ తయారైన కంపోస్టు నర్సరీ మొక్కలకు వినియోగించగా మిగిలిన విక్రయించి గ్రామ పంచాయతీకి ఆధాయం సమకూర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శులు సుమన్, రజిత పాల్గొన్నారు.

పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు తగిన గుర్తింపు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

తనను నమ్ముకొని కష్ట కాలంలో పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన మండల మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అంకతి శ్రీనివాస్‌ను మంచిర్యాల జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్‌గా నియమించారు. ఎమ్మెల్యే నివాసంలో అంకతి శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానించి నియమక పత్రాన్ని అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూతనను నమ్మి తనకు ఈ పదవి కట్టబెట్టిన ఎమ్మెల్యేకు ముందుగా ధన్యవాదాలు తెలిపారు. మొదటి నుండి ప్రేమ్ సాగర్ రావు అన్న అలాగే వారు చేసే సేవ కార్యక్రమాలన్న చాలా అభిమానమని అన్నారు. నమ్ముకున్న కార్యకర్తల కోసం దేనికైనా వెనుకాడడని, అలాగే కాంగ్రెస్‌ను నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు ఏదో విధంగా తగిన గుర్తింపుతో పాటు తన వంతు సహాయ సహకారాలు అందజేసే గుణం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుదని వారి సేవలను కొనియాడారు.

బీసీ ఉద్యోగస్తులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలి



నవతెలంగాణ-నస్పూర్

బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలోని ఏఓ రాజేశ్వర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాలలో అన్ని కేటగిరీలలో కలిపి బీసీలు 11 శాతం మాత్రమే ఉన్నట్లు నివేదికలు తెలుపుతున్నాయని, కేంద్రంలోని 54 లక్షల ఉద్యోగాలలో కేవలం 4 లక్షల 62 వేలు మాత్రమే మండల కమిషన్ సిఫార్సుల ప్రకారం 32 సంవత్సరాల క్రితం ప్రభుత్వ ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పటికీ బీసీలకు11 శాతం కూడా వాటా లేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 16 క్లాజ్ 4ఎ ప్రకారం జనాభా ప్రాతిపాధికన ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శాఖ పురి భీంసేన్, నాయకులు మాడిశెట్టి వెంకటేష్, బోరే రాజయ్య పాల్గొన్నారు.

మేళాను సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) శ్రీరాంపూర్‌లో జనవరి 20వ తేదిన ప్రధానమంత్రి నేషనల్ అపెంటిస్ మేళా (పీఎన్ఏఎం) నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.సుజాత ఒక పకటనలో పేర్కొన్నారు. అప్రెంటిస్ షిప్ మేళాలో పలు కంపెనీలు భర్తీ చేస్తాయన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, వెల్డర్, టర్నర్, మెషినిస్ట్, కోపా ట్రేడ్స్ 2024 నాటికీ పాసైన జ్ఞాత కరిగిన అభ్యర్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు అప్రెంటికెషిపిండియా.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఎస్ఎస్సీ మెమో, కులం, ఐటీఐ, బయోడేటా జిరాక్స్ కాపీతో అప్రెంటిస్ రిజిస్ట్రేషన్ పత్రంను వెంట తీసుకొని రావాలన్నారు.

కమ్యూనిస్టు పాలన రావాలి

● సీపీఐ(ఎం) చెన్నూర్ ఏరియా కార్యదర్శి బోడంకి చందు



నవతెలంగాణ-జైపూర్

భారత దేశంలో కమ్యూనిస్టు పాలన వచ్చినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని సీపీఐ(ఎం) చెన్నూర్ ఏరియా కార్యదర్శి బోడంకి చందు అన్నారు. సంగారెడ్డి పట్టణంలో నిర్వహించనున్న సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్లను చెన్నూర్ మండలం బావురావుపేట్ శివారు గుడిసెవాసులతో కలిసి విడుదల చేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ పరాయి పాలన పోయి దేశానికి స్వాతంత్ర్యం వస్తే మేలు జరుగుతుందని ఆశించిన ప్రజలకు మిగిలింది ఏమీ లేదని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి దేశాన్ని పాలిస్తున్న కాంగ్రెస్, బీజేపీ మూలంగా దేశం, రాష్ట్రం ఎంత మాత్రం అభివృద్ధి చెందకుండా పోయిందని అన్నారు.కార్పోరేట్ సంస్థల అధినేతలకు ఊడిగం చేస్తున్న ప్రభుత్వాల తీరుతో పేద ప్రజలు స్వాతంత్ర్య ఫలితాలు పొందలేకపోతున్నారని అన్నారు. దోపిడి మోసాలు ప్రజలపై నిర్బంధాలు పెగిరిపోయి విద్య వైద్యం వ్యాపారంగా మారిందని ఆవేధన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడం, యువత గంజాయి, డ్రగ్స్ సంస్కృతి, మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని అన్నారు. ఈ అంతటికి కారణమైన పాలక పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లతో పాటు భూర్జువ పార్టీలైన ఇతర పార్టీలను పక్కన పెట్టి కమ్యూనిస్టు రాజ్యాన్ని తెచ్చుకున్నప్పుడే ఆశించిన ఫలితాలను పొందగలమని అన్నారు. ఇప్పటికి ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలు కమ్యూనిస్టు పార్టీల పోరాట ఫలితమేనని పేరొకన్నారు. కాగా జనవరి 25 నుండి 28 వరకు సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో ఇట్టి విషయాలు చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు జిమిడి కుమార్, భూర్తి వెంకటస్వామి పాల్గొన్నారు.

రైతు భరోసా లబ్దిదారుల భూముల సర్వే



నవతెలంగాణ-కాసిపేట

మండలంలో రైతు భరోసా లబ్దిదారులకు సంబంధించిన భూములను అధికారులు సర్వే చేశారు. రైతు భరోసా కింద దరఖాస్తులు చేసుకున్న లబ్దిదారులకు సంధించిన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట ఉందా లేదా అనే విషయాన్ని మోకాపైకి వెళ్లి పట్టా పాస్ బుక్‌లను పరిశీలించి వివరాలను నమోదు చేశారు. కొండాపూర్లో సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి రజిత పాల్గొన్నారు.

తాండూర్ : మండలంలోని మాదారం పంచాయతీలో ఎంపీడీఓ శ్రీనివాస్ డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌తో కలిసి సాగులో లేని వ్యవసాయ భూముల గుర్తింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టాదారులతో మాట్లాడారు. రైతు భరోసా విధివిధానాల గురించి గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఏజాజుద్దీన్ పంచాయతీ కార్యదర్శి సౌందర్య గ్రామస్తులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు పబ్దిదారుల సర్వే

రేచిని గ్రామంలో పంచాయితీ ప్రత్యేక అధికారి జి అనిల్ కుమార్ సెక్రెటరీ శ్రీనివాస్ తో కలిసి రేషన్ కార్డు లబ్దిదారుల ఎంపిక సర్వేలో పాల్గొన్నారు. లబ్దిదారుల ఎంపిక అనంతరం గ్రామసభలో వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



తప్పుడు అఫిడవిట్లు అందజేసే వారిపై కఠిన చర్యలు



నవతెలంగాణ-జైపూర్

పాస్ పోర్ట్ పొందడం, ఉద్యోగ నియామకం కోసం, ఇతర దేశాలకు వెళ్లాల్సిన సమయంలో తమపై ఎలాంటి పోలీస్ కేసు లేదంటూ తప్పుడు అఫిడవిట్లు అందజేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల పరిధిలో పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ (పీవీసీ) పోలీస్ క్లీయరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ) కోసం దరఖాస్తులు చేసుకునే వారు కొంత మంది గతంలో వారిపై ఉన్న కేసులు నమోదై ఉన్నా.. తమపై ఎలాంటి కేసులు లేవంటూ పోలీస్ కేసుల క్లియరెన్స్ నిమిత్తం తప్పుడు అఫిడవిట్లు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో రామగుండం పోలీస్ స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బంది వారి ధరఖాస్తు ఆధారంగా విచారణ చేపట్టినప్పుడు కొంత మందిపై కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. గతంలో కూడా తప్పుడు అఫిడవిట్లు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపిన సీపీ ఇప్పుడు తప్పుడు అపిడవిట్లు సమర్పించిన సుమారు 20 మంది ఉన్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గుర్తించారని వెల్లడించారు. తప్పుడు అఫిడవిట్లు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేయనున్నామని, భవిష్యత్తులో కూడా పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్, పోలీస్ క్లీయరెన్స్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తులు చేసుకునే వారు తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అదేవిధంగా అఫిడవిట్ నోటరీ చేసే వాళ్లు కూడా మీ దగ్గరకు అఫిడవిట్ కోసం వచ్చే వాళ్లకు కూడా తప్పుడు సమాచారంతో అఫిడవిట్ సమర్పిస్తే విచారణలో పోలీసు వారు గుర్తించడం జరుగుతుందని ఫలితంగా కేసులు నమోదు కావడంతో పాటు జైలుకు వెల్లాల్సి వస్తుందని తెలియాల్సిన అవసరమని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-నస్పూర్

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని మంచిర్యాల ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎస్ఆర్పీ-3 గనిలో ఉద్యోగులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ విధులకు హాజరయ్యే ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం నివారించాలని, మద్యం సేవించి వాహనాలను నడపడం వంటివి చేయరాదని ఉద్యోగులను కోరారు. ఈ సందర్భంగా గని ఉద్యోగులు మాట్లాడుతూ రోడ్డుపై పశువులు, మూగ జీవాలు అడ్డుగా రావడం వలన సెకండ్ షిఫ్ట్, నైట్ షిఫ్ట్ ఉద్యోగులకు ప్రమాదాలకు దారి తీస్తున్నందున వాటికి రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని కోరారు. వారి అభ్యర్థనకు స్పందించిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనరాయణ అతి త్వరలో రోడ్డుపై సంచరించే జీవాలను వేరొక చోటికి తరలించే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దానికి బదులుగా ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకట్రావ్, రక్షణాధికారి మహేందర్, సంక్షేమాధికారి ఎస్.సాధన్, గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) పిట్ సెక్రెటరి మురళీ చౌదరి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టేకుమట్ల గ్రామ శివారులో రహస్యంగా పేకాడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. టేకుమట్ల శివారులో గల ఫామ్ హౌజ్‌లో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న విషయం తెల్సిన మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐ రాజకుమార్, ఎస్ఐ లచ్చన్న సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా వారి వద్ద నుండి రూ. 20,040 నగదుతో పాటు ఐదు మొబైల్ ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ లచ్చన తెలిపారు. పట్టుబడిన వారిలో గోదావరిఖని ఎన్టీపీసీకి చెందిన ఉసేటి వెంకట్రావ్, ఇందుకూరి కృష్ణం రాజు, హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన బొబ్బిలి పరమేష్, గోదావరిఖని ఎన్టీపీసీకి చెందిన ధర్మాజీ లక్ష్మన్, పెద్దపల్లి జిల్లా అంతర్గాంకు చెందిన సంతోష్ ఉన్నారు. పట్టుబడిన నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు తదుపరి విచారణ నిమిత్తం స్థానిక జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.



కోల్ మైన్స్ పెన్షన్ స్కీం సవరించాలి

● బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శిని కలిసిన రిటైర్డ్ ఉద్యోగులు



నవతెలంగాణ-జైపూర్

1998 సంవత్సరంలో ప్రారంభించిన కోల్ మైన్స్ పెన్షన్ స్కీం సవరించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు దండం రాజు రాంచందర్, ఆళవందార్ వేణుమాధవ్‌లు అభ్యర్థించారు. శుక్రవారం హైదరాబాద్‌లో బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి, సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డ్ చైర్మెన్ విక్రమ్ దేవ్ దత్తాను కలిసి ఈ మేరకు వినతీ పత్రం అందజేశారు. సింగరేణి భవన్ వేధికగా 183వ కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ట్రస్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అదేవిధంగా ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ బోర్డు ఆఫ్ ట్రస్టీ సభ్యులను కలిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫించన్‌దారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పదవీ విరమణ పొందుతున్న సమయంలో మంజూరైన పించన్ చెల్లింపు అదేవిధంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. ఫలితంగా రిటైర్డ్ ఉద్యోగులు అతి తక్కువ పింఛన్‌తో ఆర్థికంగా నానా ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణిలో పదవీ విరమణ పొందిన వారిలో వెయ్యి రూపాయలకు మించకుండా పింఛన్ పొందుతున్న వారు అత్యధికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ నిధి బలోపేతం చేస్తూ రిటైర్డ్ ఉద్యోగికి గౌరవప్రదమైన జీవితంగడిపే విధంగా పెన్షన్ స్కీంలో సవరణలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై గత కొంత కాలంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులకు, సంబంధిత శాఖ అధికారులకు ఎన్నోమార్లు వినతీ పత్రాలు సమర్పించినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని వివరించారు. అదేవిధంగా పెన్షన్ మంజూరిలో విపరీతమైన జాప్యం జరుగుతుందని తెలిపిన నాయకులు అన్ని ధ్రువపత్రాలు ఆన్‌లైన్ చేసినప్పటికీ పెన్షన్ మంజూరిలో మూడు, నాలుగు నెలలు వేచి చూడాల్సివస్తోందని తెలిపారు.

నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మున్సిపల్ కమిషనర్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

నవతెలంగాణ తెలుగు దినపత్రిక 2025 నూతన క్యాలెండర్‌ను లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పత్రికల పాత్ర ఎంతో కీలకం అని అన్నారు. ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా ఉంటూ, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకోని వెళ్ల ప్రజా సమష్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

క్రికెట్ క్రీడాకారులకు నగదు బహుమతి అందజేత



నవతెలంగాణ-జైపూర్

మండల స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొన్న కిష్టాపూర్ క్రికెట్ క్రీడాకారులకు మాజీ సర్పంచ్ చందుపట్ల పద్మజ పాపిరెడ్డి రూ.5 నగదు బహుమతి అందజేశారు. ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీకృష్ణ ఏడాది పదవీ కాలం విజయవంతంగా పూర్తి చేసుకున్న సంధర్భంగా మండల స్థాయిలో వీవీ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. మండల పరిధిలో గల వివిధ గ్రామాలకు చెందిన 34 జట్లు పోటీల్లో పాల్గొంటుండగా శుక్రవారం టేకుమట్ల-కిష్టాపూర్ జట్ల మధ్య జరిగిన లీగ్ మ్యాచ్‌లో కిష్టాపూర్ జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన టేకమట్ల జట్టు బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 10 ఓవర్లలో 69 రన్నులు సాధించగా తదుపరి బ్యాటింగ్ చేపట్టిన కిష్టాపూర్ జట్టు 9.4 ఓవర్లలో 70 పరుగులు సాధించారు. హోరాహోరీగా సాగింది. మ్యాచ్‌లో విజయం సాధించగా ఎర్రం మనోహర్‌రెడ్డిని మ్యాన్ ఆఫ్ దీ మ్యాచ్‌గా ప్రకటించి కప్పును అందజేశారు.

సాగు భూములకే రైతు భరోసా వర్తింపు

● బెల్లంపల్లి తహసీల్దార్ జ్యోత్స్న

నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వం సాగులో ఉన్న భూములకే రైతు భరోసా ఇవ్వనున్నందున సాగులో లేని వ్యవసాయ భూముల గుర్తింపు కార్యక్రమం కొనసాగుతోందని తహసీల్దార్ జ్యోత్స్న తెలిపారు వ్యవసాయ రెవెన్యూ పంచాయతీ రాజ్ శాఖలకు చెందిన అధికారులు పంచాయతీ పరిధిలోని రెవెన్యూ శివారు ప్రాంతాలలో సర్వే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ యోగ్యం కానీ బంజరు భూములను, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించిన భూములను గుర్తిస్తున్నామన్నారు. వెంచర్లు పారిశ్రామిక అవసరాలకు వినియోగించిన భూములను భారీ నిర్మాణ వైశాల్య స్థలాల భూముల వివరాలను గుర్తించడం జరుగుతుంది. సర్వే అనంతరం గ్రామసభల్లో లబ్దిదారుల ఎంపిక ప్రకటించనున్నట్టు తెలిపారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

బంజారాల ఆరాధ్య దైవం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం, బాసరలో ఫిబ్రవరి16న జరిగే జయంతి వేడుకలను ప్రతి బంజారాలు హాజరై విజయవంతం చేయాలని దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బంజారా నాయకులతో కలిసి మాట్లాడారు. సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ నడువాలని కోరారు. బంజారాల చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తెలిపారు. వారి వెంట మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ ఉన్నారు.



మహా ధర్నా పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-తలమడుగు

ఈనెల 20న ఛలో ఉట్నూర్ మహాధర్నా పోస్టర్లను శుక్రవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో పూనగూడ గ్రామంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షులు కుమ్మర న్యానేశ్వర్ మాట్లాడారు. మహా ధర్నా కార్యక్రమానికి మండల గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిడాం మాధవరావు, మాజీ మండలాధ్యక్షులు సిడాం రాము, ఆనందరావు, సీతారాం, రమేష్, కోవ యువరాజ్, దేవరావు, మాధవ్ వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అదనపు మిల్క్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని సేవలాల్ తండా గ్రామంలోని మిల్క్ కలెక్షన్ సెంటర్‌ను జిల్లా విజయ డెయిరీ మేనేజర్ దస్రు నాయక్ శుక్రవారం సందర్శించారు. జిల్లాలోని ఈ గ్రామంలోనే అత్యధికంగా సుమారు 400 లీటర్ల పాలు వస్తుండటంతో రైతులకు సమయం ఎక్కువ పడటంతో వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతుందని మేనేజర్‌కి పాడి రైతులు తెలియజేశారు. దీంతో గ్రామంలో అదనంగా మరో మిల్క్ కలెక్షన్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ సానుకూలంగా స్పందిస్తూ 2 మిల్క్ కలెక్షన్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలని ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళుతానని అన్నారు. కార్యక్రమంలో విజయ డైరీ దేగామ బీఎంసీయూ ఇన్‌చార్జి మేనేజర్ గజ్జరాం, డైరీ ఫీల్డ్ సూపర్‌వైజర్ రమేష్, పాడి రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఉచిత కరెంట్ అమలు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రజకులకు, నాయి బ్రహ్మణులకు ఉచిత కరెంట్ ఇచ్చిందని, కానీ ఇప్పుడు బిల్లులు వస్తున్నాయని దాన్ని మళ్లీ అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు అన్నారు. ఇటీవల సంటెన్న ఇస్త్రీ టెల కాలిపోవడంతో బీసీ సంఘ, భవనంలో బాధితుడికి రూ.15వేల ఆర్థిక సాయం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాయిబ్రహ్మణులు, రజకులకు ఉచిత కరెంట్ ఇచ్చిందని, షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగితే పరిహారం అందడం లేదని చిక్కాల దత్తు అన్నారు. అదే విధంగా బిల్లులు కూడా వస్తున్నాయని, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి, బిల్లులను మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, అశోక్, రాజు, సత్యనారాయణ, నర్సిములు, ప్రశాంత్, సంతోష్, వినోద్, జక్కుల దేవిదాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని భుక్తాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని లైన్‌ల మరమ్మత్తుల కొరకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ సదానందం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల పట్టణంలోని విద్యానగర్, భుక్తాపూర్, ద్వారకానగర్, సినిమా రోడ్, మోచిగల్లి, రాణిసతిజీ కాలనీ ఏరియాలలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

ఆదిలాబాద్‌రూరల్ : ఆదిలాబాద్ మండలంలోని 33/11కేవీ రాంపూర్ సబ్ స్టేషన్‌లో శనివారం మరమ్మత్తుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని దీనివల్ల ఆదిలాబాద్ మండలంలోని కుర్షిద్ నగర్, రణదివేనగర్, సుందరయ్యనగర్, నీలనగర్, గాంధీ నగర్, ఇందిరా నగర్, డాల్డా కంపెనీ ఏరియా, హరిఓం నగర్, రాంపూర్ ఇండస్ట్రీయల్ ఏరియాలలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని ఏఈ కోరారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా రాథోడ్ బిక్కు

నవతెలంగాణ-నార్నూర్

బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా రాథోడ్ బిక్కు శుక్రవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా కుమురంభీం జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆ పార్టీ జిల్లా ఎన్నికల అధికారి శ్రీశైలం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనితో మండల ఉపాధ్యక్షుడి నుంచి అధ్యక్షుడిగా పదోన్నతి ఇవ్వడం గర్వంగా ఉందని, రాథోడ్ బిక్కు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు.

కల్తీకల్లు విక్రయిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-భిక్కనూర్(రాజంపేట్)

కల్తీకల్లు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు హెచ్చరించారు. శుక్రవారం రాజంపేట్ మండలంలోని తలమడ్ల, ఆరేపల్లి గ్రామాలలో కల్లు దుకాణాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లు శాంపిల్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే విధంగా కల్తీ కల్లు విక్రయించవద్దని కల్లు నిర్వాహకులకు సూచించారు. ఈ తనిఖీలలో ఎక్సైజ్ ఎస్సై దీపిక, హెడ్ కానిస్టేబుల్ మొయినుద్దీన్, కానిస్టేబుల్ శరత్, మహేష్, సిబ్బంది, తదితరులున్నారు.

నూతన గ్రామపంచాయతీని ప్రారంభించిన ఎమ్మెల్యే.

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని అంబేద్కర్‌నగర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలోని బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. రూ.20లక్షల వ్యయంతో నిర్మించే ఈ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రెంజల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొబిన్‌ఖాన్, మాజీ జెడ్పిటిసి నాగభూషణంరెడ్డి, ధనుంజయ్, సిహెచ్ రాములు, జావిద్, గంగాకృష్ణ, ఓ.మోహన్, మైని మోహన్, వద్దవ్, వసంత్, బన్సియ నాయక్, షావుక అలీ, ఉబేద్, తదితరులు పాల్గొన్నారు.

యువతిపై సర్జికల్ బ్లేడ్‌తో దాడి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

యువతీపై సర్జికల్ బ్లేడ్‌తో యువకుడు దాడి చేసిన సంఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సోఫినగర్‌కు చెందిన సంతోష్, దివ్య అనే యువతి వద్ద కొంత మొత్తం అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న అప్పు తీర్చాలని యువతి పలుమార్లు సంతోష్‌ను నిలదీసింది. డబ్బులు చెల్లించకపోగా యువతిపై కోపం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో దివ్య అప్పు విషయం అడిగేందుకు సోఫినగర్‌లోని సంతోష్ వద్దకు వెళ్లింది.అప్పటికే కోపంతో ఉన్న సంతోష్ డబ్బులు ఇవ్వను అని చెప్పడంతో పాటు తన వద్ద ఉన్న సర్జికల్ బ్లేడ్‌తో దివ్య గొంతుపై దాడి చేశాడు. దుండగుడు అక్కడి పారిపోయాడు. తీవ్ర రక్త స్రావం అయిన దివ్యను స్థానికులు గమనించి జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని తెలిపారు.



సమాచార హక్కు చట్టం బలహీన వర్గాలకు ఆయుధం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) బలహీనవర్గాల ఆయుధమని తెలంగాణ రాష్ట్ర స్టేట్ యాక్టివిటీ ప్రెసిడెంట్ సయ్యద్ హైదర్ అన్నారు. శుక్రవారం ఆర్టీఐ కార్యాలయంలో సభ్యత్వ నమోదును కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ప్రకటించారు. నూతన జిల్లా అధ్యక్షులుగా సిహెచ్ వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ మూసెబ్, వైస్ ప్రెసిడెంట్‌గా సూర్యనారాయణ, సోఫీ మహమ్మద్ ఇలియాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అబ్దుల్ సాదిక్, సెక్రటరీలుగా సయ్యద్ హుజూర్, సోఫీ మహమ్మద్ ఇమ్రాన్, మహమ్మద్ ఆకిఫ్, ఆర్గనైజర్ సెక్రెటరీగా అబ్దుల్ రవూఫ్ ఎన్నికయ్యారు. నిర్మల్ డివిజన్ డివిజన్ ప్రెసిడెంట్‌గా జహీర్ అహ్మద్, సెక్రెటరీగా సూఫీ అబ్దుల్ వహీద్, ఆర్గనైజ్ సెక్రెటరీగా సోఫీ మహమ్మద్, అబ్దుల్ షాకీర్‌ను ఎన్నుకున్నారు.

మహముద్‌ఖాన్ మరణం కాంగ్రెస్‌కు తీరని లోటు

• మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఇచ్చోడ

ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహముద్ ఖాన్ అకాల మరణం, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మంత్రి సీతక్క అన్నారు. ఇటీవల గుండె పోటుతో మహముద్ ఖాన్ మృతి చెందిన విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్, ఆత్రం సుగుణ, స్థానిక నాయకులు ఆసీఫ్‌ఖాన్, నారాయణరెడ్డి, కార్యకర్తలతో కలిసి శుక్రవారం రాత్రి ఇచ్చోడ మండల కేంద్రంలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషించిన మహముద్‌ఖాన్ ఇక లేరు అన్న విషయం బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మెన్ సత్యవతి కోటేష్, ఇచ్చోడ మండల ప్రెసిడెంట్ ముస్కు నారాయణరెడ్డి, సిరికొండ మండల ప్రెసిడెంట్ షేక్ ఇమామ్, రహిముద్దిన్, చంద్రయ్య, లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, బోథ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, ఆసిఫుల్లాఖాన్, ముస్తాఫా, చౌహన్ శేషురావ్, షాదుల్లా, ఇచ్చోడ యూత్ ప్రెసిడెంట్ క్రాంతి కిరణ్, టౌన్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ రంజిత్, సద్దాం, రెండ్ల రాజన్న, అలీం,ఫేరోజ్ పాల్గొన్నారు.

పోచారం కుటుంబంపై మాట్లాడితే

నవతెలంగాణ-వర్ని

గత నాలుగు రోజుల క్రితం కవిత బాన్సువాడలో ప్రెస్‌మీట్ పెడితే ఈ పనికిరాని ఏనుగు గ్రూప్ యలమంచిలి శ్రీనివాస్‌రావు పోచారం కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేశారని.. ఖబడ్దార్ యలమంచిలి అని ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా హెచ్చరించారు. శుక్రవారం వర్ని మండల కేంద్రంలో సీసీడీ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు, మైనారిటీ నాయకులు మాట్లాడుతూ.. 'ఏనుగు రవీందర్‌రెడ్డి నీవు ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టినావు. ఇప్పుడు బాన్సువాడలో పార్టీని బొంద పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నావు. ఎందుకూ పనికిరాని యలమంచిలి అనే వ్యక్తికి డబ్బులు ఇచ్చి ప్రెస్‌మీట్ పెట్టించి మా నాయకులు పోచారం కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. మీరు ఇంతకు కాంగ్రెస్ పార్టీ వారేనా..?' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన పోచారం కుటుంబం నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు నేమాని వీర్రాజ్, మైనారిటీ నాయకులు భారీ, గోపాల్, గిరి, శ్రీనగర్ రాజు, మాజీ జడ్పీటీసీ బాధ్యనాయక్, నారోజీ గంగారాం, నామాల సాయిబాబా, కృష్ణరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ హైమద్, మూడ్ అంబర్ సింగ్, సీహెచ్ గంగారాం, శనిగరం కిషన్, బిందెల సంజీవ్, పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నవతెలంగాణ-పిట్లం

అనుమానాస్పద స్థితిలో మహిళా మృతి చెందినట్టు స్థానిక ఎస్సై రాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన గొరిగి సత్యవ్వ (55) సుమారు 38 సంవత్సరాల క్రితం అల్లాపూర్ గ్రామానికి చెందిన అంజికొండతో వివాహమైంది. ఆమెకు కూతురు భర్తతో గొడవలు జరిగి చిన్నకొడప్‌గల్ గ్రామంలోనే నివాసం ఉంటోంది. కాగా గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో సత్యవ్వ అన్న పాపికొండ సత్యవా పొద్దటి నుంచి కనిపించడం లేదని ఆమె ఇంటికి వెళ్లి చూడగా సత్యవ్వ ఇంట్లోనే చనిపోయి ఉంది. ఆమె ఒంటిపై ఉన్న బంగారు చెవి పోగులు, గువ్వ పోగులు, పుస్తే, నల్లపూసల దండ, రెడ్‌మెడ్ రెండు ముక్కుపుడకలు, కనిపించలేదని అవి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను చంపి ఆభరణాలు దొంగిలించినట్టు మృతురాలి అన్న గొరిగే పాపికొండ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో బాధపడుతూ ఒకరి మృతి

నవతెలంగాణ-ఎడపల్లి

అనారోగ్యంతో బాధపడుతూ ఒకరి మృతిచెందారు. ఈ ఘటన రుద్రూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన శాకరి సాయిలు మేస్త్రి (36) ఐదు రోజుల క్రితం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శుక్రవారం సాయంత్రం మృతిచెందారు. సాయిలుకు భార్య, కుమారుడు, కుమార్తె, ఉన్నారు.

బడి బయట పిల్లల గుర్తింపు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామాలలో శుక్రవారం బడిబయట పిల్లలను గుర్తించినట్టు మండల విద్యాధికారి షౌకత్ అలీ తెలిపారు. మండలంలోని ముస్తాపూర్, శెట్పల్లి, లింగంపేట్ గ్రామాలలో ఇంటి వద్ద ఉన్న పిల్లలను గుర్తించినట్టు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించి బడిలో చేర్పించేలా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. సంక్రాంతి సెలవుల అనంతరం బడి బయట పిల్లలను బడిలో చేర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, రాజు, విజయ్, సంఘగౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మార్కండేయ మందిరంలో పద్మశాలి సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అలాగే రాష్ట్ర మీడియా ఉపాధ్యక్షులుగా ఎంపికైన బోడ సాయిలును ఘనంగా సన్మానించారు. ఫిబ్రవరి 1న జరిగే మార్కండేయ జయంతిని ఘనంగా జరపాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

నవతెలంగాణ-భిక్కనూర్

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మహిళా సాధికారత కేంద్ర సిబ్బంది సౌందర్య తెలిపారు. శుక్రవారం మండలంలోని అంగన్వాడి కేంద్రాలలో మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత, పేరు ప్రఖ్యాతలు తెచ్చుకునే విధంగా మహిళకు తనకంటూ ఒక ఉపాధి కల్పించుకునే విధంగా ఎదగాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మహిళలు ముఖ్యంగా మగ్గం, బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సులు ఉచితంగా నేర్చుకునే అవకాశం ఉందని, ఆహార పదార్థాల తయారీ చేసే పద్ధతులు వివరించారు. ప్రభుత్వ హెల్ప్ లైన్ సదుపాయాల్లో సఖి సర్వీసెస్ 181 హెల్ప్‌లైన్ నెంబర్ సదుపాయం, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930, చిల్డ్రన్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098 సదుపాయాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా కళా ప్రదర్శన

నవతెలంగాణ-లింగంపేట్

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆటలు పాటల రూపంలో వాహనదారులకు వివరించారు. హెల్మెట్ ధరించి బైకులు నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. అతివేగం ప్రమాదకరమని, ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని వారు పాటల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విట్టల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శిల్ప సవిత, విద్యా లక్ష్మీనారాయణ, తిరుపతి, రమేష్, నరేష్, పోశెట్టి పోలీసులు వాహనదారులు కళాకారులున్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డిని సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. జిల్లాలో గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు లింగారెడ్డి, కార్యవర్గ సభ్యులు, రెడ్డి సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసుల సంస్కృతి ప్రతిబింబించేలా టీఏజీఎస్ క్యాలెండర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసుల సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా టీఏజీఎస్ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను రూపొందించారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ కార్యాలయంలో టీఏజీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా క్యాలెండర్‌లో పొందుపరిచిన చిత్రాలు, ఆదివాసుల ప్రాంతాల గురించి నాయకులు జోగు రామన్నకు తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లా అంటేనే ఆదివాసీ జిల్లా అని అన్నారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌లో కుమురంభీంతో పాటు ఆదివాసుల చరిత్రలు, సంస్కృతిని చాటేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, లంక రాఘవులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, సేవ్వ జగదీష్, అశోక్ స్వామి, ఉగ్గే విఠల్, వినోద్, వాఘ్మారే ప్రశాంత్ పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని మార్కగూడ గ్రామంలో రాంజీగోండ్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని, కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. శుక్రవారం రోజు టోర్నమెంట్ ముగింపు సందర్భంగా పోటీల్లో కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. మొదటి రూ.21వేలు బహుమతి సేవా క్లబ్ కిన్వట్ రెండో బహుమతి రూ.15వేలు వైజాపూర్ మూడో బహుమతి రూ.10వేలు డోంగర్గావ్ మహారాష్ట్ర నాలుగో బహుమతి రూ.7వేల1 లాల్‌గడ్, మరో నాలుగు జట్ల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సంతోష్, తొడసం సుదర్శన్, భీంపూర్ మాజీ సర్పంచ్ లింబాజీ, సెడ్మకి సంజీవ్, అమర్ సింగ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



నవతెలంగాణ-ఉట్నూర్

అజయ్ పవార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కొలాంగూడ, మణిగూడ, గ్రామాల్లో దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తన మేనల్లుడి జన్మదినం సందర్భంగా దుప్పట్లను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బానోత్ రామారావు, బానోతు విజయబాయి, మాజీ జెడ్పీటీసీ, పవర్ సరిత, జాదవ్ జగదీష్, మాజీ సర్పంచ్ రాజేశ్వర్, జాదవ్ రాజు, కుంర శ్రీనివాస్, ఆడ నాగేశ్వర్, జాదవ్ విలాస్, పవార్ రఘునాథ్, ఎల్ఐసీ ఏజెంట్, గంగారాం, గ్రామ పటేల్ కొడప జంగు పటేల్, కొడప రాజు, భీంరావు, మాణిక్, రామ్ లక్ష్మణ్, రాందాస్, రాము, శీను, అజయ్ ఫౌండేషన్ సభ్యులు జాదవ్ ప్రవీణ్, రోహిత్, సాయి కిరణ్, సాహిత, విరాట్ పవార్ పాల్గొన్నారు.

అవయవదానం చేసిన కుటుంబానికి పత్రం అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఇటీవల కాలంలో గ్రామానికి చెందిన మల్లయ్య హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో మరణించారు. మల్లయ్య మరణించిన అనంతరం అవయవదానం చేయడానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులకు జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధి శివకుమార్ మల్లయ్య భార్యకు శుక్రవారం అవయవ దానం చేసినందుకు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు భీమ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకటొరెడ్డి, నాయకులు లింగారెడ్డి, స్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైన్స్ ఆకస్మిక తనిఖీ చేసిన ఎక్సైజ్ శాఖ

నవతెలంగాణ-భిక్కనూర్

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో భిక్కనూర్, పెద్దమల్లారెడ్డి గ్రామాలలో గల వైన్స్‌లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు వైన్స్‌లోని మద్యం బాటిళ్లు, స్టాక్ రిపోర్ట్, రిజిస్టర్‌లను పరిశీలించారు. మద్యం బాటిల్‌పై స్టిక్కర్లు, మద్యం బాటిళ్లను పరిశీలించి నకిలీ మద్యం విక్రయిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఎక్సైజ్ ఎస్సై దీపిక, హెడ్ కానిస్టేబుల్ మొయినుద్దీన్, కానిస్టేబుల్ శరత్, మహేష్, సిబ్బంది ఉన్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్(రాజంపేట్)

ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రాజంపేట్ మండల మెడికల్ అధికారి విజయ మహాలక్ష్మి తెలిపారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా హెల్త్ సూపర్వైజర్ మహమ్మద్ మంజూర్, గంగామణి గ్రామంలోని ఇంటి పరిసరాలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు, దోమలు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.